

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బలాల

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే బలాల

ఓల్డ్‌మలక్‌పేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ మలక్‌పేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. సోమవారం ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. బాక్స్‌డ్రైన్, సీసీరోడ్ల నిర్మాణం, రూ.5కోట్లతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మలక్‌పేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మలక్‌పేట డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫియుద్దీన్, డీఈ శంకర్, వాటర్‌వర్క్ డీజీఎం హస్మత్‌అలీ, మలక్‌పేట సర్కిల్ డీసీ జయంత్, పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వికలాంగులు అన్ని రంగాల్లో రాణించాలి : బలాల

ఓల్డ్‌మలక్‌పేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : వికలాంగులు అన్ని రంగాల్లో రాణించే విధంగా కృషిచేయాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ యూసీడీ ఆధ్వర్యంలో మలక్‌పేటలోని వికలాంగుల పార్క్‌లో వికలాంగుల దినోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అనంతరం ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వివిధ రకాల ఉపకరణాలు వికలాంగులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీ జయంత్, యూసీడీ యుగెంధర్‌రెడ్డి, ఎంఐఎం అధ్యక్షుడు షఫియుద్దీన్ పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి స్పందన

చాదర్‌ఘాట్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తలసేమియా రోగుల కోసం ఆల్‌ఇండియా పయామ్ ఇన్‌సానియత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మలక్‌పేటలో నిర్వహించిన స్వచ్ఛంద మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే అహ్మద్ బలాల, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ సందర్శించారు. అబు ఐమల్ మద్దతుతో 632 రక్త యూనిట్లను సేకరించి తలసేమియా రోగులకు అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్, ప్రధాన కార్యదర్శి అలీంబేగ్ పాల్గొన్నారు.

ఘనంగా శివ మహాపడిపూజ



పరమేశ్వర మహా రుద్రాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బీఎన్ రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున భక్త సమాజం ఆధ్వర్యంలో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో శివగురుస్వామి ముద్రగోని సతీష్‌కుమార్‌గౌడ్ శివ మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరై పరమేశ్వర మహా రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు అరవింద్‌రెడ్డితో పాటు శివ స్వాములు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో 'పోలి స్వర్గం' పూజలు

సరూర్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగిసిన నేపథ్యంలో మరుసటి రోజైన సోమవారం మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మహిళా భక్తులు పోలి స్వర్గం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే స్థానిక ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం స్థానిక నీటి కొలనుల్లో దీపాలు వదిలారు. పలువురు భక్తులు ఇళ్లలోనే పోలి స్వర్గం పూజలు నిర్వహించి పాత్రల్లో నీరునింపి దీపాలను వదిలి మొక్కు తీర్చుకున్నారు. మీర్‌పేట్‌లోని శివసాయినగర్‌కాలనీలో గల గౌరీ నీలకంఠేశ్వరస్వామి సమేత లక్ష్మీగణపతి ఆలయంలో తెల్లవారు జామున రుద్రాభిషేకం నిర్వహించి అనంతరం కొలనులో దీపాలు సమర్పించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మధుయాష్కీగౌడ్

ప్లాస్టిక్ కవర్లలో వేడి పదార్థాలు కేన్సర్‌కు కారణం

● టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

హయత్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్లలో వేడి పదార్థాలు తీసుకువస్తే కేన్సర్‌కు దారితీసే అవకాశం ఉంటుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. సోమవారం వనస్థలిపురంలో జాగృతి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో క్యారీ యూవర్ ఓన్ బ్యాగ్ పేరుతో ఏర్పాటు చేసిన పోస్టర్‌ను మధుయాష్కీగౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడి వేడి కాఫీ, టీ, సాంబారు లాంటి పదార్థాలు ప్లాస్టిక్ బ్యాగుల్లో తీసుకురావడం మంచిది కాదని అన్నారు. ప్లాస్టిక్ వస్తువులు, కవర్ల వల్ల కేన్సర్ వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతిఒక్కరూ వైద్యుల సూచనలను పరిగణలోనికి తీసుకుని జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కట్ల నర్సింహయాదవ్, మకుటం సదాశివుడు, భవానీ, స్వర్ణ, మాధవి, వెంకట్ ఆచార్య, వేణుగోపాల్, ఉదయ్, వెంకటేశం, నరేందర్ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వే ప్రారంభం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా లెప్రసీ అధికారి పాపారావు తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపు కార్యక్రమ ర్యాలీని సోమవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసన్నలక్ష్మీ, జిల్లా లెప్రసీ అధికారి పాపారావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధామాధవి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 2నుంచి 15వ తేదీ వరకు పీహెచ్‌సీ పరిధిలోని ఆశవర్కర్లు ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు ప్రతిఇంటికి వెళ్లి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. సర్వేలో గుర్తించిన లెప్రసీ వ్యాధిగ్రస్థులకు పీహెచ్‌సీలో డీపీఎంవో ద్వారా పరీక్షలు చేసి లెప్రసీ కేసుగా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీఎంవో సులోచన, డీపీఎంవో శాంతిరాజ్, ఎంపీహెచ్‌ఈవో లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ చంద్రశేఖర్, యాదగిరి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఈఈ కార్తీక్, పక్కన కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవ సంబరాలను కాంగ్రెస్ ప్రభుత్వం వైభవంగా నిర్వహిస్తుందని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 8,9వ తరగతి విద్యార్థులకు రోడ్డు నిర్మాణంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాతవాహనకాలనీలో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణంపై ఈఈ కార్తీక్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సేవ ఇస్లావత్, నగేష్‌నాయక్, డీఈ రవిచంద్ర, నాయకులు పలుసం శ్రీధర్‌గౌడ్, రాజేశ్వరీ, వసంత, ప్రవీణ్‌రెడ్డి, రోహిత్, కందికంటి శ్రీధర్‌గౌడ్, విష్ణు, నరేష్, వెంకట్, శాతవాహనకాలనీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, శ్రీపతిరావు, ఉమారెడ్డి పాల్గొన్నారు.

అన్నదాన ప్రభువే.. శరణం అయ్యప్ప..!

● మండల కాలంలో అయ్యప్పస్వాములకు అన్నదానం ● స్వాముల సేవలో అయ్యప్ప సేవా సంఘాలు



దిల్‌సుఖ్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జ్యోతి స్వరూపుడు.. హరిహర సుతుడు అయ్యప్ప దీక్ష కఠోర నియమనిష్టలతో కూడుకున్నది. ప్రతి ఏటా కార్తీక మాసం నుంచి వేలాది మంది అయ్యప్ప భక్తులు మాల ధారణ గావించి మండల కాలం(41 రోజులు)పాటు కఠోర దీక్ష అవలంబిస్తారు. శివునికి ప్రీతిపాత్రమైన కార్తీక మాసం మొదలుకుని.. జనవరిలో వచ్చే మకరజ్యోతి(సంక్రాంతి) వరకు అయ్యప్ప మాలధారణలు చేసి, అయ్యప్ప దీక్షలు చేపట్టే స్వాములు మండల కాలం పూజా నియమాలు పాటిస్తూ.. నిత్యపూజలు చేయడం ఒక ఎత్తయితే.. ఆహార నియమాలతో అన్న ప్రసాదం స్వీకరించడం మరో ఎత్తు. మాలధారణ చేసిన అయ్యప్పస్వాములు భోజనం విషయంలో ఎన్నో రకాల నియమ, నిష్టలు పాటించాల్సి ఉంటుంది. స్వాములు ఎక్కడ పడితే అక్కడ.. ఎప్పుడు పడితే అప్పుడు ఆహార పదార్థాలను స్వీకరించరు. ఉల్లి, వెల్లుల్లి లేని సాత్విక భోజనం చేస్తారు.

పంచగిరివాసాలో వేలాది స్వాములకు అల్పాహారం

ఓల్డ్ మలక్‌పేటలోని అయ్యప్పస్వామి ఆలయంలో రాము గురుస్వామి, నాని గురుస్వాముల ఆధ్వర్యంలో కొలువుదీరిన పంచగిరివాసా అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో పదిహేను సంవత్సరాలుగా అన్నదానం, అల్పాహారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వంట చేసుకునే వీలులేని స్వాములు చాలా మంది వస్తులుండాల్సి వస్తుండడాన్ని గమనించి రాము, నాని(రామస్వామి)గురుస్వాములు 2009లో అన్నప్రసాద కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాడు 50మంది స్వాములకు భిక్ష, అల్పాహారంతో మొదలైన కార్యక్రమంలో నేడు ప్రతి రోజు వెయ్యి నుంచి 1500మంది స్వాములు అన్నప్రసాదాలను స్వీకరిస్తున్నారు. అయితే చాలా చోట్ల మధ్యాహ్నం అన్నదానం(భిక్ష) పెడుతున్నప్పటికీ, రాత్రివేళ ఎక్కడ కూడా అల్పాహారం పెట్టడం లేదు. కానీ పంచగిరివాస ఆధ్వర్యంలో ప్రతి రోజు అల్పాహార వసతి ఉండడంతో ప్రస్తుతం ప్రతి రోజు వెయ్యి మంది వరకు అల్పాహారాన్ని స్వీకరిస్తున్నారు.

మొగుళ్లపల్లి యువసేన ఆధ్వర్యంలో..

చైతన్యపురికి చెందిన డాక్టర్ మొగుళ్లపల్లి ఉపేందర్‌గుప్తా ఆధ్వర్యంలో 15 సంవత్సరాలుగా ప్రతి ఏటా 41రోజుల పాటు(నవంబరు 21 నుంచి డిసెంబరు 31 వరకు)మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని(భిక్ష) అందిస్తున్నారు. కొత్తపేట హుడాకాలనీ రామాలయంలో 3సంవత్సరాలు, కొత్తపేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఎనిమిది సంవత్సరాలు భిక్ష వసతి కల్పించిన మొగుళ్లపల్లి యువసేన బృందం ప్రస్తుతం ఎస్‌ఆర్‌ఎల్‌కాలనీ దాసాంజనేయస్వామి ఆలయ ఆవరణలో ప్రతిరోజు మధ్యాహ్నం 12గంటల నుంచి 3గంటల వరకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు సుమారు 1500 నుంచి 2000 మంది అయ్యప్పస్వాములు ఇక్కడ భోజనం స్వీకరిస్తున్నారు. దీంతో పాటు సరూర్‌నగర్ రామాలయంలో, దిల్‌సుఖ్‌నగర్ షిరిడీ సాయి సంస్థాన్‌లో కూడా అయ్యప్ప స్వాములకు ప్రతి రోజు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సాక్షాత్తు అయ్యప్పకు భోజనం పెట్టినట్లే..



యాంత్రిక జీవనంలో కుటుంబ పోషణలో భాగంగా వివిధ ప్రాంతాలు వెళ్లాల్సి ఉంటుంది. ఏ వృత్తి చేసే వారైనా దీక్ష చేపట్టిన స్వాముల సౌలభ్యం కోసం అన్నదానం చేపడుతున్నాం. స్వాములకు భోజనం పెడితే సాక్షాత్తు ఆ అయ్యప్పకు పెట్టినట్లే అని భావిస్తున్నాం. దైవచింతనతో సహపంక్తి భోజనం ఏర్పాటు చేస్తున్నాం. జేబులో వేల రూపాయలు ఉన్నప్పటికీ.. ఎక్కడపడితే అక్కడ తినలేని పరిస్థితి ఉంటుంది. అలాంటి స్వాముల కోసం 15 ఏళ్లుగా ప్రతి రోజు మధ్యాహ్నం వేలాది మంది స్వాములకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నాం. అన్నప్రసాదానికి సహకరిస్తున్న దాతలకు, సేవ చేస్తున్న మొగుళ్లపల్లి యువసేన బృందానికి నా కృతజ్ఞతలు.

\- మొగుళ్లపల్లి ఉపేందర్‌గుప్తా, గురుస్వామి.

స్వాములు రాత్రి వేళ ఇబ్బంది పడకూడదనే..



మాల ధారణ చేసిన స్వాములు భిక్ష, అల్పాహారం కోసం ఇబ్బందులు పడకుండా ఉండడం కోసమే ప్రతి ఏటా నవంబర్ 22 నుంచి జనవరి 1వ తేదీ వరకు మండల కాలం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నాం. చాలా మంది స్వాములు రాత్రి సమయాల్లో తినకుండా నిద్రిస్తున్న విషయాన్ని గమనించి ప్రతి రోజు సుమారు 1200 మంది స్వాములకు అల్పాహారం ఏర్పాటు చేస్తున్నాం. స్వాములతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్న రోగుల సహాయార్థుల కోసం గాంధీ ఆస్పత్రి వద్ద కూడా ఉచితంగా భోజన పంపిణీ చేపడుతున్నాం.

\- నర్సింగ్‌రావు, గురుస్వామి

తారామతిపేట-భద్రాచలం రోడ్డుగా పేరు మార్చండి

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగురోడ్డు తారామతిపేట ఎగ్జిట్ నంబర్ 10నుంచి ప్రారంభం కానున్న గౌరెల్లి-భద్రాచలం రోడ్డు పేరులో మార్పులు చేయాలని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డిని తారామతిపేట మాజీ ఎంపీటీసీ చేగూరి వెంకటేశ్ సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కొత్తగా నిర్మించనున్న భద్రాచలం రోడ్డు తారామతిపేట రెవెన్యూ నుంచి ప్రారంభం అవుతుందని గౌరెల్లికి ఏమాత్రం సంబంధం లేదని తహసీల్దార్‌కు తెలిపారు. అలైన్‌మెంట్‌లో గౌరెల్లి- భద్రాచలం రోడ్డు అని వస్తుందని తారామతిపేట-భద్రాచలం రోడ్డుగా పేరు మార్చాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అలైన్‌మెంట్‌లో తారామతిపేట-భద్రాచలం రోడ్డు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్వే డాటా ఎంట్రీ ప్రారంభం

ఓల్డ్‌మలక్‌పేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : మలక్‌పేట డివిజన్ పరిధిలో సర్వే పూర్తికావడంతో డాటా ఎంట్రీ ప్రారంభమైంది. ఓల్డ్‌మలక్‌పేటలోని అఫ్జల్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం నుంచి ఆపరేటర్లు సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ కల్లా ఎంట్రీ పూర్తిచేయాలి. మొత్తం 58,560 సర్వే వివరాలను ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. ప్రతిరోజు 200మంది ఆపరేటర్లు రెండు షిఫ్టుల్లో సుమారు 5వేల ఎంట్రీలు చేసే విధంగా ప్రణాళిక రూపొందించారు. డాటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్ నమోదు చేయాలని సర్కిల్-6 డీసీ జయంత్ ఆపరేటర్లకు సూచించారు.

ప్రజాపాలన విజయోత్సవాల్లో నేడు అర్బన్ డే

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దినోత్సవాల్లో భాగంగా పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో మంగళవారం అర్బన్ డే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. అందులో భాగంగా 5వ వార్డులోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ నుంచి జేసీబీ షోరూం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం పారిశుధ్య సిబ్బందికి సేఫ్టీ కిట్స్ పంపిణీ, సన్మానం, మెడికల్ క్యాంపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొననున్నట్లు తెలిపారు.

నాగపూర్‌కు చేరిన గోరక్ష పాదయాత్ర

సైదాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గోహత్యలు ఆపాలని, గోఆధారిత వ్యవసాయం ప్రోత్సహించాలని కోరుతూ సైదాబాద్‌కు చెందిన బాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 27న కాశ్మీర్ నుంచి ప్రారంభమైన గోరక్ష పాదయాత్ర సోమవారం నాగపూర్‌కు చేరుకుంది. ఈసందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని నాగపూర్‌లోని ఆయన నివాసంలో బాలకృష్ణ గురుస్వామి కలిసి వినతి పత్రం సమర్పించారు. గోహత్య చట్టాలను తీవ్రతరం చేసి, గోహత్యలను ఆపాలని గడ్కరీని అభ్యర్థించారు. ఇందుకు సానుకూలంగా స్పందించినట్లు బాలకృష్ణ గురుస్వామి తెలిపారు. సెప్టెంబర్ 27న కాశ్మీర్ నుంచి ప్రారంభమైన గోరక్ష పాదయాత్ర 14 రాష్ట్రాల మీదుగా 4,900 కిలోమీటర్లు, 180రోజుల పాటు కొనసాగి మార్చి 27 2025న కన్యకుమారి చేరనుంది.

ఆర్చరీ విజేత చికితారావు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ ఆర్చరీ సంఘం నిర్వహించిన అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్‌లో కాంపౌండ్ విభాగంలో చికితారావు విజేతగా నిలిచింది. కొల్లూర్ డీపీఎస్‌లో జరిగిన ఈ పోటీల్లో చికిత 690 పాయింట్లతో అగ్రస్థానం సొంతం చేసుకోగా, మానస 683 పాయింట్లతో రజతం, మన్సురాహ్ కాంస్య పతకాలు సాధించారు. పురుషుల్లో శివసాయి, సాయి సుశాంత్, రాజేందర్ తొలి మూడు స్థానాల్లో నిలిచి సత్తా చాటారు. ఈ పోటీల్లో పతకాలు నెగ్గిన క్రీడాకారులు తెలంగాణ తరఫున జాతీయ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారు.

బడంగ్‌పేట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

● కౌన్సిల్ సమావేశంలో మేయర్ పారిజాతారెడ్డి



మాట్లాడుతున్న మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ అభివృద్ధిపై తమ పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించిందని, సభ్యుల సహకారంతో అన్నివిధాలుగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కౌన్సిల్ మీటింగ్‌లో రూ.52కోట్ల విలువైన పనులకు సంబంధించి 25 అంశాలతో కూడిన ఎజెండాపై సుదీర్ఘ చర్చ జరిపారు. అనంతరం ఎజెండాలోని అంశాలన్నింటికీ ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా పారిజాతారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుద్దీపాల ఏర్పాటు వంటి అంశాలపై తమ పాలకవర్గం దృష్టి పెట్టిందని అన్నారు. అధికారయం త్రాంగంలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సైతం అభివృద్ధిలో భాగస్వాములయ్యారని ఆమె పేర్కొన్నారు. పారిశుధ్యం గతంలో కన్నా బాగా మెరుగైందని, స్వచ్ఛ ర్యాంకు సాధించడానికి తాము కృషి చేస్తున్నామని అన్నారు. కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందిన అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచి తొందరగా పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని మేయర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ పి.సరస్వతి, మేనేజర్ నాగేశ్వరరావు, డీఈఈలు యాదయ్య, జ్యోతిరెడ్డి, నర్సింహరాజు, ఏఈ వినీల్‌గౌడ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన నేతలు



మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ భూపాల్‌రెడ్డి

సరూర్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలంలోని మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలో గల పలు ప్రభుత్వ పాఠశాలలను సోమవారం బీఆర్‌ఎస్ నేతలు సందర్శించారు. జిల్లెగూడలోని చల్లా లింగారెడ్డి జడ్పీహైస్కూల్‌తో పాటు ప్రాథమిక పాఠశాలను మీర్‌పేట్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్‌గౌడ్ తదితరులు సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం వండుతున్న మహిళలను కలిసి వారి సమస్యలను సైతం తెలుసుకున్నారు. వంట నాణ్యతను పరిశీలించి, అనంతరం చిన్నారులకు భోజనం వడ్డించారు. ఎమ్మెల్యే సబితారెడ్డి ఆదేశాల మేరకు తాము పాఠశాలలను సందర్శించినట్లు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లావణ్యబీరప్ప, రాజేందర్‌రెడ్డి, పద్మాఅంజయ్య, ధనలక్ష్మీరాజ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు ఎం.ఏ. రజాక్, పార్టీ నాయకులు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గోపీ యాదవ్, బలరామ్, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు సునీతాబాల్‌రాజ్, రెహ్మాన్ పాల్గొన్నారు.

నాదర్‌గుల్‌లో..

నాదర్‌గుల్‌లోని ప్రభుత్వ పాఠశాలను మాజీ కౌన్సిలర్ యెల్బల మమతాసుదర్శన్‌రెడ్డి సోమవారం సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు. పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేద విద్యార్థినులకు సగౌర సొసైటీ చేయూత

సైదాబాద్ : నీట్‌లో మంచి పర్సంటైల్ సాధించి మెడిసిన్ సీటు సంపాదించిన మలక్‌పేటకు చెందిన పేద విద్యార్థిని కె.యోగిత, బీ ఫార్మసీ చదువుతున్న ఎస్.భారతిలకు సగౌర చారిటబుల్ సొసైటీ ద్వారా ఒక్కొక్కరికి రూ.25వేల చెక్కును సోమవారం అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ పేదవిద్యార్థుల ఉన్నత చదువులకు తమ సొసైటీ అన్నివిధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతినిధులు డాక్టర్ ప్రకాశ్, ప్రభాకర్, పీఆర్టీయూ ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సాంబశివరావు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో అక్రమ నిర్మాణాలు

● జోనల్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకుల ఆందోళన



అక్రమ నిర్మాణాలను తొలగించాలని జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ఎల్బీనగర్, డిసెంబర్ 2(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఆందోజు రవీంద్రాచారి ఆరోపించారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో జరుగుతున్నటువంటి అక్రమ వ్యాపార సముదాయాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయం ఎదుట సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీపీఐ నేతలు, కార్యకర్తలు బైఠాయించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉపకమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతో ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. అక్రమ నిర్మాణాలపై అనేక సార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు చూసీచూడనట్లు ఉంటున్నారని అన్నారు. శివగంగకాలనీలో సర్వే నంబర్ 66/8లో అక్రమ నిర్మాణం జరుగుతున్నా దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. బొమ్మలగుడి నుంచి వీరన్నగుట్ట వెళ్లే దారిలో అనుమతి లేకుండా అనేక అక్రమ వ్యాపార సముదాయాలు, రేకుల షెడ్లు నిర్మిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ నేతలు జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం సహాయ కార్యదర్శి బాతరాజు నర్సింహ, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఫైమిద, హయత్‌నగర్ మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి, సహాయ కార్యదర్శులు బోయపల్లి రాములుగౌడ్, కందుల సుధాకర్, మద్రి శోభన్, అరుణ్‌కుమార్‌గౌడ్, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గసభ్యులు రమావత్ సక్రునాయక్, శాఖ కార్యదర్శులు సరిత, అనిత, సౌజన్య, నాగరాజు, చెంది వెంకట్ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులపై దృష్టి సారించాలి : కలెక్టర్

హైదరాబాద్ సిటీ : ప్రజావాణిలో అందించే దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. గ్రీవెన్స్‌సెల్‌లో వివిధ సమస్యలపై 332 మంది దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటాచారి, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీలో 132 దరఖాస్తులు

జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు ఆరు జోన్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 132 దరఖాస్తులు వచ్చాయి. జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి 17, ఏసీ రెవెన్యూ, అడ్మిన్‌కు 4, సీఈ మెయింటనెన్స్ వెటర్నరీ, ఎల్‌ఏఓకు 3, శానిటేషన్, హెల్త్, యూబీడీ సీఈ ప్రాజెక్టుకు-1 ఆర్జీలు చేసుకున్నారు. అలాగే ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 6 వచ్చాయి.

మరికొన్ని విభాగాలకు దరఖాస్తులు అందజేశారు. కాగా, వీటితోపాటు జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 94 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

బడంగ్‌పేట్‌లో పార్కు స్థలాలను కాపాడాలని అధికారులకు వినతి

సరూర్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 31వ డివిజన్‌లోని ఎంసీఆర్‌కాలనీలో సర్వే నంబర్.139లో గల దాదాపు 2000 చందరపు గజాల ఖాళీ స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకుని కబ్జా కాకుండా కాపాడాలని బీజేవైఎం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు కబ్జాదారులు సదరు ఖాళీ స్థలాన్ని కాజేయడానికి కుట్రలు పన్నుతున్నారని, ఈ దృష్ట్యా దానికి రక్షణ కంచె వేసి సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కాలనీ ప్రవేశ మార్గం వద్ద 73,74 ప్లాట్లకు తూర్పు వైపు గల పబ్లిక్ రోడ్డును ఆక్రమించి ఓ ప్రజాప్రతినిధి భర్త షెట్టర్లు నిర్మించాడని, వాటిని సైతం అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు. కార్పొరేషన్ పరిధిలోని అనేక డివిజన్లలో వేలాది గజాల పార్కు స్థలాలు కబ్జా అవుతున్నాయని, వాటన్నింటిపైనా అధికారులు దృష్టి సారించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సతీశనంద, ప్రవీణ్‌కుమార్‌గౌడ్, పవన్‌కుమార్, మల్లెల మహేందర్ పాల్గొన్నారు.



ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలి

కొత్తపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ అన్నారు. సోమవారం బోడుప్పల్ మెరీడియన్ స్కూల్ నుంచి 62 మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. టీటీఐ సిబ్బంది వారికి పార్కు గోడలపై ఉన్న ట్రాఫిక్ నిబంధనల పోస్టర్లు, రోడ్‌సైన్స్ చూపుతూ టీటీఐ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. టీటీఐ ఏఎస్‌ఐ సోమ్‌నాథ్, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్, సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

11 అవగాహన కార్యక్రమాల్లో 913 మంది విద్యార్థులు

టీటీఐ అధికారులు, సిబ్బంది ఎల్బీనగర్, సరూర్‌నగర్, చింతలకుంట, కొత్తపేట, చైతన్యపురి ప్రాంతాల్లో గల విద్యాసంస్థలను సోమవారం సందర్శించి, విద్యార్థులకు నిబంధనలపై అవగాహనకు వీడియో క్లిప్స్ ప్రదర్శించామన్నారు. ఏబీసీ ఆఫ్ రోడ్ సేఫ్టీ రూల్స్ బుక్ లెట్స్ విద్యార్థులకు అందజేశామన్నారు. 11 అవగాహన కార్యక్రమాల్లో 913 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

రేపు మాజీ సీఎం రోశయ్య వర్ధంతి

చాదర్‌ఘాట్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సీఎం రోశయ్య 3వ వర్ధంతి కార్యక్రమాన్ని నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈనెల 4న నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి రోశయ్యకు నివాళులర్పిస్తారన్నారు.

కామన్వెల్త్ కరాటేలో హైదరాబాదీల సత్తా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో జరుగుతున్న కామన్వెల్త్ కరాటే చాంపియన్‌షిప్‌లో ముగ్గురు హైదరాబాదీలు పతకాలు కొల్లగొట్టారు. రామినేని రోహన్ (63 కిలోలు) క్యాడెట్ విభాగంలో స్వర్ణం, అమ్రాది విశాల్ రెడ్డి (57 కి.) క్యాడెట్ విభాగంలో కాంస్యం, తాళపత్రి ఆరాధ్య (42 కి.) కుమిటేలో స్వర్ణ పతకాలు సాధించారు. టీపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కరాటే సంఘం అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, కోచ్ నరేష్ ముదావత్ ఈ ముగ్గురు క్రీడాకారులను అభినందించారు.